కలుషిత నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి


టీఆర్‌టీ కాలనీలోని ఓ ఇంటి సంపులోని నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నల్లకుంట డివిజన్ టీఆర్‌టీ కాలనీలో నెలకొన్న కలుషిత నీటి సమస్య పరిష్కారానికి జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ యాకర అమృత సూచించారు. మంగళవారం డివిజన్‌లోని టీఆర్‌టీ కాలనీలో ఆమె పాదయాత్ర చేసి ఇంటింటికీ వెళ్లి తాగునీటి నల్లాల నుంచి సరఫరా అయిన కలుషిత నీటిని పరిశీలించారు. 15 రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానికులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఇళ్లలోని నీటి సంపులను, డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను స్థానికులు, అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టీఆర్‌టీ క్వార్టర్స్‌లో నెలకొన్న కలుషిత నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని అధికారులను కోరారు. లేనిపక్షంలో స్థానికులతో కలిసి జలమండలి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రోహిత్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి మహేష్‌కుమార్, నాయకులు నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.


టెన్నికాయిట్ పోటీలను ప్రారంభిస్తున్న సుశీల్‌కుమార్

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

అంబర్‌పేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని తెలంగాణ టెన్నికాయిట్ అసోసియేషన్ వైస్ చైర్మన్ సుశీల్‌కుమార్ సూచించారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న 8వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టెన్నికాయిట్ చాంపియన్ షిప్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనే విధంగా పిల్లలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. ఇక్కడ గెలిచిన వారిని చెన్నైలో నిర్వహించే టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీలకు తీసుకెళ్తామన్నారు. ధనుంజయగౌడ్, సద్గురు రాకేష్, వెంకటేష్, రాజశేఖర్, శివుడు తదితరులు పాల్గొన్నారు.


బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు బాధాకరం: కాంగ్రెస్

చిక్కడపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ గాంధీనగర్ డివిజన్ యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం అశోక్‌నగర్ చౌరస్తాలో కేంద్ర హోమ్‌శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ముషీరాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ మాట్లాడుతూ, తెలంగాణ అంటేనే గద్దర్ పేరు గుర్తుకు వస్తుందని, అలాంటి ఉద్యమ కెరటం గురించి బండి సంజయ్‌కుమార్ అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. వెంటనే ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మారిశెట్టి నర్సింగ్, అజయ్, కోటి, తేజ్‌కుమార్‌నాయక్, కరుణాకర్, మనోహర్‌యాదవ్, రమేష్, దినేష్, సాయిరామ్, చందు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

● ముషీరాబాద్ డిప్యూటీ ఐఓఎస్ స్వరూపారాణి

ముషీరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రెండేళ్లుగా నత్తనడకన కొనసాగుతున్న ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనులను సత్వరం పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ముషీరాబాద్ విద్యా మండలి డిప్యూటీ ఐఓఎస్ స్వరూపారాణి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, ముషీరాబాద్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగపాక వెంకట్‌లు ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు పాఠశాల భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్‌ఎం, మండల డిప్యూటీ ఐఓఎస్ స్వరూపారాణిలను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణ పనులు కొన్ని నెలలుగా పూర్తిగా నిలిచిపోయాయని ఫిర్యాదు చేశారు. సమస్యలను ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని వాజీద్ హుస్సేన్, వెంకట్‌లు తెలిపారు. ఉపాధ్యాయులు నరేందర్ యాదవ్, రతన్, ఇమ్రాన్, పద్మ పాల్గొన్నారు.


నల్లగొండ సభకు వెళ్లిన ముఠా జైసింహ తదితరులు

రైతులను మోసం చేసిన కాంగ్రెస్: జైసింహ

ముషీరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్నదని బీఆర్‌ఎస్ యువనాయకుడు ముఠా జైసింహ విమర్శించారు. ప్రభుత్వం రైతులకు చేసిన మోసానికి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండలో నిర్వహించిన రైతు మహాధర్నాకు ముషీరాబాద్ నుంచి బీఆర్‌ఎస్ యువ నాయకుడు జైసింహా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. తరలివెళ్లి తమ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ముషీరాబాద్, కవాడిగూడ, భోలక్‌పూర్, గాంధీనగర్, అడిక్‌మెట్, రాంనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, శ్యామ్, రాకేష్ కుమార్, బల్లాశ్రీనివాస్ రెడ్డి, శంకర్ ముదిరాజ్, శ్రీనివాస్‌రావు, పార్టీ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, వల్లాల శ్యామ్ యాదవ్, శ్రావణ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్ తదితరులు

ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 6న దీక్ష

● టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : భారత అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, లేనిపక్షంలో ఫిబ్రవరి 6న ఇందిరాపార్కు వద్ద దీక్ష చేపడతామని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం విద్యానగర్‌లోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో వర్గీకరణ అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పారన్నారు. దానికి అనుకూలంగా ఏకసభ్య కమిషన్ వేసి 60 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వినతిపత్రాలు తీసుకున్నారని, ఇప్పటికైనా కాలయాపన మానుకోవాలన్నారు. వర్గీకరణ జరగకుండా మందకృష్ణ మాదిగ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు రమేష్, గణేష్, శ్రీనివాస్, నర్సింహ, యాకయ్య, అంజయ్య, సంజీవ, హుస్సేన్, యాదగిరి, లక్ష్మమ్మ, శాంతికిరణ్, వెంకట్, చందు, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బోర్ వేశారు.. విద్యుత్ కనెక్షన్ మరిచారు!

● ఏడేళ్లుగా నిరుపయోగంగా పవర్‌బోర్

● నీటి కోసం సింగాడికుంట ఎంసీహెచ్ క్వార్టర్స్‌వాసుల అవస్థలు

● పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


సింగాడికుంటలోని ఎంసీహెచ్ క్వార్టర్స్


మునిసిపల్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన పవర్‌బోర్, సింటెక్స్ ట్యాంక్‌లు

కవాడిగూడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం, అధికారుల సమన్వయ లోపం కారణంగా బస్తీవాసులు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. కవాడిగూడ డివిజన్ సింగాడికుంట ఎంసీహెచ్ క్వార్టర్స్‌లో ఏడేళ్ల క్రితం పవర్ బోర్ వేసిన అధికారులు నేటికీ దానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో బోర్ నిరుపయోగం మారింది. దీనికి తోడు క్వార్టర్స్‌లో ఉన్న పబ్లిక్ నల్లా కనెక్షన్‌ను ఇటీవల కట్ చేయడంతో స్థానికులు నీటి కోసం అల్లాడుతున్నారు. బోర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారుల చుట్టూ గత ఏడేళ్లుగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆ పని తమది కాదంటే.. తమది కాదని జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ విభాగాల అధికారులు చెప్తున్నారంటున్నారు.

పబ్లిక్ నల్లాను కూడా తొలగించారు..

2018 సంవత్సరంలో అప్పటి హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ కె లక్ష్మణ్, కవాడిగూడ కార్పొరేటర్ జి. లాస్యనందితల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ప్రభాకర్ ఫండ్ నిధులతో బస్తీవాసుల నీటి సమస్యను తీర్చేందుకు పవర్ బోర్ వేసి సింటెక్స్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. అయితే, నాటి నుంచి నేటి వరకు బోర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో బోరు వేసినా ఫలితం లేకుండాపోయింది. ఇటీవల సింగాడికుంటలో తాగునీటి పైప్‌లైన్‌ను ఆధునీకీకరించారు. ఈ సందర్భంగా క్వార్టర్స్‌లో ఉన్న పబ్లిక్ నల్లా కనెక్షన్ కూడా వాటర్‌వర్క్స్ అధికారులు కట్ చేయడంతో ఇక్కడ ఉండే వారు తాగునీటికోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. చివరకు క్వార్టర్స్‌లోని వారెవరైనా చనిపోతే చుట్టుపక్కల బస్తీలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందరూ జీహెచ్‌ఎంసీ రిటైర్డ్ కార్మికులే..

కవాడిగూడ మునిసిపల్ క్వార్టర్స్‌లో దాదాపు 42 కుటుంబాలు ఉంటున్నాయి. వీరంతా గతంలో మునిసిపల్ జీహెచ్‌ఎంసీ కార్మికులుగా పనిచేసి రిటైర్ అయిన వారే. క్వార్టర్స్‌లోని ఇళ్లలోకి వచ్చే నల్లా నీరు సరిపోక నీటి కోసం సమీపంలోని వాటర్ ప్లాంట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. అధికారుల మధ్య సమన్వయ లోపం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతోనే తాము నీటి కోసం ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, సంబంధిత అధికారులు క్వార్టర్స్‌లోని పవర్ బోర్‌కు వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇచ్చి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఏడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాం



మునిసిపల్ క్వార్టర్స్‌లోని పవర్ బోర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ఏడేళ్లుగా ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులు, వాటర్‌వర్క్స్ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. రెండు శాఖల అధికారులు ఆ పని తమది కాదని తప్పించుకుంటున్నారు. దీంతో క్వార్టర్స్‌లో నీటి సమస్య పెరిగిపోయింది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని మా కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా.

\- పి.లక్ష్మణ్, ఎంసీహెచ్ క్వార్టర్స్ అధ్యక్షుడు

పబ్లిక్ నల్లాను తొలగించడంతో పెరిగిన సమస్య



క్వార్టర్స్‌లో ఏడేళ్ల క్రితం వేసిన పవర్ బోర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోగా, ఇటీవల మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పి బస్తీలో ఉన్న పబ్లిక్ నల్లాను కూడా కట్ చేశారు. ఇటు బోరు అందుబాటులోకి రాక.. నల్లా నీరు లేక బస్తీవాసులు నీటి కోసం అల్లాడుతున్నాం. బస్తీలో ఎవరైనా చనిపోతే నీళ్ల కోసం సమీపంలోని బస్తీలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వెంటనే తమ సమస్యను పరిష్కరించాలి.

\- అనురాధ, స్థానికురాలు

సమస్య పరిష్కారానికి కృషి



సింగాడికుంటలోని ఎంసీహెచ్ క్వార్టర్స్‌లో నెలకొన్న నీటి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తా. బస్తీలో నిరుపయోగంగా ఉన్న పవర్ బోర్ విషయాన్ని జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్తా. రెండు విభాగాల అధికారులు సమన్వయంతో బోర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇప్పిస్తా.

\- జి.రచనశ్రీ, కవాడిగూడ కార్పొరేటర్

భక్తిశ్రద్ధలతో 'షబ్ - ఏ మేరాజ్' ప్రార్థనలు


ప్రార్థనలకు హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

ముషీరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ముస్లిలు పవిత్రంగా జరుపుకునే షబ్-ఏ మేరాజ్ పండుగ సందర్భంగా మంగళవారం మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అల్లా అనుగ్రహాన్ని పొందిన రోజుగా పాటిస్తూ మసీదుల్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ ముషీరాబాద్‌లో జరిగిన గ్యార్వీ ఉత్సవాలలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో సీఐ రాంబాబు భోలక్‌పూర్, ముషీరాబాద్ లోని బడిమసీద్, బిలాల్‌మసీదు, మజీద్‌ఏకో, ఫిర్‌దోజ్, జంజం మసీదుల వద్ద బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, గౌస్, జాఫర్, మహ్మద్ మియా, సయ్యద్ అహ్మద్ భక్తియార్, ఎండీ మోహిన్, జావెద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు..


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి

బండి సంజయ్ బహిరంగ క్షమాపణలు చెప్పాలి

● గద్దర్ గళం అసోసియేషన్

బర్కత్‌పుర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు పద్మశ్రీ ఇచ్చేది లేదని అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్ బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. పద్మశ్రీ కాదు భారతరత్న ఇచ్చి గద్దర్‌ను గౌరవించాలని వారు డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, గద్దర్ గళం అసోసియేషన్ వ్యవస్థాపక చైర్మన్ కొల్లూరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పసుమూరి రవీందర్, సభ్యులు తదితరులు మాట్లాడారు. కరీంనగర్‌లో 15 అడుగుల గద్దర్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు. గద్దర్ పేరును కేంద్రానికి సూచించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైస్తవుల మనోభావాలు దెబ్బతిన్నాయి

● మాదిగ రాజ్యాధికార పోరాట సమితి అధ్యక్షుడు

ముషీరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హెబ్రోన్ చర్చి విషయంలో ఇరువర్గాల గొడవల కారణంగా స్థానికులకు ఇబ్బందులు ఏర్పడటంతో పాటు క్రైస్తవుల మనోభావాలు దెబ్బతింటున్నాయని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నవీన్‌రాజ్ అన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని గొడవలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం భోలక్‌పూర్ డివిజన్ సంజీవయ్యనగర్‌లో రాజకీయ పార్టీ నేతలు, క్రైస్తవ పెద్దలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రెండు వర్గాల గొడవల వల్ల చర్చికి వచ్చే పాస్టర్‌లు, క్రైస్తవులు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారని నవీన్‌రాజ్ అన్నారు.

ట్రెజరీ నుంచి వేతనాలు ఇప్పించే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తా : ఉపేందర్‌రెడ్డి

చిక్కడపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పెన్షనర్లకు 010 పద్దుకింద ట్రెజరీ నుంచి వేతనాల మంజూరు, హెల్త్ కార్డుల సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హైదరాబాద్ నగర కేంద్రగ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళవారం సాయంత్రం చిక్కడ పల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొక్కుల దేవేందర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ, గ్రంథాలయ పెన్షనర్లకు 010 పద్దు కింద ట్రెజరీ నుంచి వేతనాల మంజూరు చేస్తే ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా అదనపు భారం పడదని చెబుతున్నందున సీఎం, డిప్యూటీ సీఎంలతో సమావేశమై ఈ విషయాన్ని వివరిస్తానన్నారు. రాష్ట్ర పెన్షనర్ల జేఏసీ కమిటీ అధ్యక్షుడు కె. లక్ష్మయ్య మాట్లాడుతూ, గ్రంథాలయ పెన్షనర్లకు 010 పద్దు కింద ట్రెజరీ నుంచి వేతనాల మంజూరయ్యేందుకు తమ వంతు కృషి, సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిసత్యనారాయణ, సంఘం ప్రధానకార్యదర్శి సోమ శివయ్య, కోశాధికారి దాచేపల్లి బుచ్చయ్య, తుమ్మ సత్యనారాయణ, కె. వీరప్ప, ఆముక్త మాల్యద, రాష్ట్ర కార్యవర్గం, 10 జిల్లా ఉమ్మడి అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ల మరమ్మతు పనులు

బర్కత్‌పుర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కాచిగూడ డివిజన్‌లో యుద్ధప్రాతిపదికన తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతు పనులు చేపట్టినట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని మనియార్‌పట్టిలో తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి లేకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, జలమండలి ఏఈ భావన, నాయకులు రాజేందర్, ఆశీష్, వినోద్, సంతోష్, భీమ్‌రాజ్, రామకృష్ణ, రవియాదవ్ పాల్గొన్నారు.

'కామన్ మెనూను అమలు చేయాలి'

అంబర్‌పేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ జిల్లా పరిధిలోని బీసీ వసతి గృహాలలో కామన్ మెనూ అమలు చేయాలని ఈబీసీ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన అంబర్‌పేట బీసీ హాస్టల్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని బీసీ వసతి గృహాలలో కామన్ మెనూను అమలు చేస్తుండగా, హైదరాబాద్‌లో మాత్రం అది అమలు కావడం లేదని ఆరోపించారు. హైదరాబాద్ పక్కనే ఉన్న రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో కామన్ మెనూ అమలవుతుండగా, హైదరాబాద్ జిల్లాలో ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించారు.సంక్షేమ వసతి గృహాలలో కామన్ మెను అమలయ్యేలా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు.

'పాత్రికేయుల సమస్యలపై పోరాటాలే శరణ్యం'


సమావేశంలో మాట్లాడుతున్న మామిడి సోమయ్య తదితరులు

నల్లకుంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఏర్పడుతోందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక నేతలు అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో జర్నలిస్టులకు మరిన్ని గడ్డు పరిస్థితులు వస్తాయని, అందుకే జర్నలిస్టులను అప్రమత్తం చేసి పోరాటాలు చేసేందుకు ఫెడరేషన్ నాయకత్వం సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఏపీడబ్ల్యూజే ఎఫ్ - టీడబ్ల్యూజే ఎఫ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వివిధ జిల్లాల ఫెడరేషన్ వ్యవస్థాపక సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కులు ప్రమాదపు అంచుల్లో ఉన్నాయని, పాలకులు ఏ ఒక్క సమస్యను పరిష్కరించకుండా దాటవేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో గత కేసీఆర్ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను పూర్తిగా విస్మరించగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా జర్నలిస్టుల న్యాయమైన హక్కులను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు,హెల్త్ కార్డులు, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీలు వేయాలని, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫెడరేషన్ నాయకులు వేణుగోపాల్, పులిపలుపుల ఆనందం, పిల్లి రాంచందర్, బండి విజయ్‌కుమార్, వల్లాల జగన్, వెంకటేశ్వర్లు, యాదగిరి, శేఖర్, బాపురావు, ఐలయ్య, పాండు రంగారావు, జగదీష్, విజయానందరావు పాల్గొన్నారు.


సినీ నటుడు బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలిపిన సాయిబాబా తదితరులు

'పద్మభూషణ్'కు ఎంపిక కావడం అభినందనీయం

రాంనగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ పద్మభూషణ్ అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయం అని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. పద్మభూషణ్ పురస్కారానికి ఎంపికైన బాలకృష్ణను టీడీపీ నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన నివాసంలో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు శ్యాంసుందర్, నగేష్, చంద్రమోహన్‌గౌడ్,భానుప్రకాష్, ప్రమీల, సత్యనారాయణ, కిరణ్, వీరబాబు, అనిల్ పాల్గొన్నారు.

ఫ్యూజ్ బాక్సులో మంటలు.. ఆర్పివేసిన ఫైర్‌సిబ్బంది

రాంనగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యానగర్ శివం రోడ్‌లోని ఏటీఎం వద్ద ఓ విద్యుత్ స్తంభానికి ఉన్న ఫ్యూజ్ బాక్సు నుంచి మంగళవారం మంటలు వచ్చాయి. ఫ్యూజ్ బాక్సు కేబుల్ వైర్లు కాలిపోతుండగా గమనించిన స్థానికులు బాగ్అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డికి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఆమె అంబర్‌పేట పోలీసులు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. దీంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. కొద్దిసేపు శివం రోడ్‌లో ట్రాఫిక్ జామ్ అయింది. మంటలు ఆర్పిన తర్వాత విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ముషీరాబాద్ డిప్యూటీ డీఈఓగా శ్రావణ్ కుమార్



ముషీరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ విద్యామండలి నూతన డిప్యూటీ డీఈఓగా కె. శ్రావణ్ కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు విధులు నిర్వహించిన చిరంజీవి ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో శ్రావణ్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..త్వరలో జరగనున్న 10వ తరగతి పరీక్షల్లో మండల పరిధిలోని 7 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సమష్టి కృషితో మండల పరిధిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తామన్నారు.


సమీవుల్లాను అభినందిస్తున్న అసోసియేషన్ నాయకులు

సీడబ్ల్యూఏ అధ్యక్షుడిగా మహ్మద్ సమీవుల్లా

అంబర్‌పేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ (సీడబ్ల్యూఏ) వెల్ఫేర్ అసోసియేషన్ హైదరాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా అంబర్‌పేటకు చెందిన మహ్మద్ సమీవుల్లా రెండవ సారి నియమితులయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన సీడబ్ల్యూఏ సమావేశంలో ఆయనను అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో ఇన్సూరెన్స్ అడ్వైజర్ సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సుఖ్ జీవన్‌రెడ్డి, కోశాధికారిగా ఎ.మూర్తి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీడబ్ల్యూఏ ఆలిండియా ప్రెసిడెంట్ జగదీశ్ జవహర్, నాయకులు సోమ నర్సయ్య, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ-1 పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. పోస్టాఫీస్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని జవహర్‌నగర్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, గోల్కొండ క్రాస్‌రోడ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10నుంచి 12, ముషీరాబాద్ పరిధిలోని టీర్బన్‌గల్లీ, పర్వాన్ హోటల్, రాజాడీలక్స్ తదితర ప్రాంతాలో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.